కొండెక్కిన కూరగాయల ధరలు



- కొనలేని స్థితిలో సామాన్యులు
- మార్కెట్‌లో టమాటా కిలో రూ.100
- అదేబాటలో మిగిలిన కూరగాయల ధరలు

కౌటాల/ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్‌: జిల్లాలో కూరగాయల ధరలు పైపైకి చేరుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.10లకు లభించిన టమాటా తాజాగా రూ.100కు చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా టమాటా ధర పెరిగింది. నిత్యం అన్ని కూరల్లో వాడే టమాట భారీగా పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు పచ్చి మిర్చి భగ్గుమంటుంది. మొన్నటి వరకు కిలో రూ.40లకు లభించిన పచ్చిమిర్చి తాజాగా మార్కెట్‌లో కిలో రూ.160 చేరింది. అదేబాటలో మిగిలిన కూరగాయల ధరలు పెరిగాయి. దీంతో సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది.

సామాన్యుడికి తిప్పలు..

అకాల వర్షాలతో గత ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో పాటు ఎలాంటి పనులు లేక చేతిలో చిల్లిగవ్వ లేని పేద, మధ్య తరగతి ప్రజలను పెరిగిన కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. కూరగాయల కొనుగోలుకు వెళ్లాలంటేనే సామాన్యులు జంకుతున్నారు. మూడు నెలల క్రితం నేలచూపులు చూసిన టమాటా ధర అమాంతం పెరిగింది. జిల్లాలో యాసంగిలో సాగు చేసిన టమాటా దిగుబడులు తగ్గడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న టమాటాకు డిమాండ్ ఉండడంతో ధర పెరిగింది. ఎప్పటికప్పుడు కూరగాయల ధరలు పెరగటమే తప్పా తగ్గడం లేదు. ధరలు స్థిరంగా లేకపోవడంతో వ్యాపారులు రెండు, మూడు రోజులు కూరగాయలు నిల్వ చేసుకోవడానికి జంకుతున్నారు. కాగా రోజంతా కూలీ చేసినా సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నామని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.100 నుంచి రూ. 200 పెడితే కూరగాయలు ఇంటిల్లిపాదికి వారం పాటు సరిపోయేవి. పెరిగిన ధరలతో రూ. 500 వరకు ఖర్చు పెట్టినా రెండు, మూడు రోజులకు మించి సరిపోవడం లేదు.

కూరగాయలు	ధరలు కిలో..
చిక్కుడుకాయ	100
మిర్చి	120
టమాటా	100
బీరకాయ	100
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంత	60
దొండకాయ	80
పాలకూర	40
సోరకాయ	60
గోబి (పూల్)	100
క్యాబేజి	60

తగ్గుతోన్న సాగు విస్తీర్ణం..

జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు విస్తీర్ణం రానురాను తగ్గిపోతుండటంతో ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కూరగాయల సాగుకు నీటి సౌకర్యం లేకపోవడంతో జిల్లా రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేస్తుండడంతో ధరలు భారీగా పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, అకాల వర్షాలకు కూరగాయల దిగుబడి తగ్గి ధరలు అమాంతం పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూరగాయల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ధరలు మండిపోతున్నాయి



మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. టమాటా కిలో రూ.100కు చేరుకుంది. రోజూ కూలీకి వెళ్తే రూ.250 వస్తున్నాయి. ప్రస్తుతం రూ.500 మార్కెట్‌కు తీసుకెళ్తే నాలుగు రకాల కూరగాయలు కూడా రావడం లేదు. అధికారులు కూరగాయల ధరలు నియంత్రించాలి.

– తారాబాయి, గృహిణి, కౌటాల

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆర్‌బీఐ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గుండాయిపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్వాతి, ప్రమోద్ ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో వీరికి రూ.5వేల నగదును హెచ్‌ఎం మార్త రమేశ్ అందజేశారు. హెచ్‌ఎం హన్మంతు విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు శ్యాంరావ్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో మంగళవారం జాతీయ ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌బీఐ ఆధ్వర్యంలో మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో 7 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ హనుమంతరావు ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, బ్యాంక్ సిబ్బంది సంజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పాత)లో విద్యార్థులకు మంగళవారం ఆల్ ఇండియా క్విజ్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘బీజేపీని బలోపేతం చేయాలి’

దహెగాం: గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ భోపాల్ నుంచి కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి వీక్షించాన్నారు. వర్షాకాలంలో మండల ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. అందవెల్లి పెద్ద వాగుపై వంతెన పూర్తి కాలేదని, వాగులో వేసిన తాత్కాలిక రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు పుప్పాల సత్యనారాయణ, పుల్గం నారాయణ, పడాల సురేశ్, ప్రదీప్, సంజీవ్, మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

మండలంలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన ప్రవంతి నీట్‌లో 427 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించినందున విద్యార్థినిని హరీశ్‌బాబు మంగళవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఆయన వెంట చంద్రపల్లి సర్పంచ్ లగ్గామ దామోదర్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

‘మేరా బూత్ –సబ్సే మజ్బూద్ సంవాద్’ వీక్షించిన బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ భోపాల్ నుంచి నిర్వహించిన మేరా బూత్ –సబ్సే మజ్బూద్ సంవాద్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సెర్ల మురళి నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాశ్, ఉపాధ్యక్షుడు జయరాజ్, శ్రీను, ఉదయ్‌కుమార్, బాలేష్, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం



కొండయ్యను సన్మానిస్తున్న ఏరియా జీఎం



నరసింహరావును సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన: ఇటీవల పదవీ విరమణ పొందిన కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్ నరసింహరావును మంగళవారం బెల్లంపల్లి ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు నర్సింహరావును శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కొండయ్యకు సన్మానం

కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎంగా విధులు నిర్వహిస్తూ ఈనెలాఖరుతో పదవీ విరమణ పొందుతున్న కొండయ్యను మంగళవారం బెల్లంపల్లి ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు కొండయ్యను శాలువాతో సన్మానించి మొక్క అందజేశారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎంలు సతీష్‌బాబు, రామారావు, ఉజ్వల్‌కుమార్ బెహెరా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీవైపీఎం తిరుపతి, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ జయప్రదం చేయండి

దహెగాం: సీఎం కేసీఆర్ ఈనెల 30న జిల్లా కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభలో సీఎం కేసీఆర్ పోడు పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, వైస్‌ఎంపీపీ చౌదరి సురేశ్, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దహెగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: కేసీఆర్ సభకు పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రతీ ఒక్కరిని ఆహ్వానించాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లా నుంచే పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం గర్వకారణమన్నారు బహిరంగ సభ ఏర్పాట్ల కోసం మండల నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సకారాం, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, వెంకన్న, ఇస్తారి, నరేందర్ గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: సీఎం పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని బాలాజీఅనుకోడ రైతు వేదికలో మంగళవారం మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి సభ విజయవంతమయ్యేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజన్న, పార్టీ మండలాధ్యక్షుడు వెంకన్న, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: పోరుగడ్డ నుంచి సీఎం కేసీఆర్ రైతులకు పోడు పట్టాలు అందిస్తారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం సీఎం కేసీఆర్‌కు విన్నవిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ విశ్వనాథ్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్ రావ్, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, హన్మంతు, శంకర్, గంగారం, ఆగయ్య, గట్టయ్య, శ్రీనివాస్, నిరంజన్, రాంచందర్, రవి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు స్థానచలనం

కౌటాల: మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో నస్రుల్లా ఖాన్ మంగళవారం తెలిపారు. మండలంలోని కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శి పి. జ్యోత్స్న బదిలీపై కాగజ్‌నగర్ మండలం రాంనగర్‌కు, కనికి పంచాయతీ కార్యదర్శి బి.తేజశ్విని, సిర్పూర్(టి) మండలం కర్జపల్లి గ్రామానికి, బాలేపల్లి పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, మండలంలోని కన్నెపల్లికి, బెజ్జూర్ మండలం లంబాడిగూడ పంచాయతీ కార్యదర్శి ఆదే విఠల్, మండలంలోని శీర్షా గ్రామానికి, సిర్పూర్(టి) మండలం కర్జపల్లి పంచాయతీ కార్యదర్శి శరణ్య, మండలంలోని కనికి గ్రామానికి బదిలీ అయినట్లు తెలిపారు.

చందాలతో రోడ్డు నిర్మాణం

- ఇంటింటికి రూ.5 వేలు జమ
- గ్రామానికి మొరం మట్టిరోడ్డు వేసిన ఎల్లాపూర్ వాసులు
- బీటీరోడ్డు నిర్మించాలని వేడుకోలు



రోడ్డు వేస్తున్న గ్రామస్తులు

వాంకిడి: రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న కాగజ్‌నగర్ మండలం లైన్‌గూడ పంచాయతీ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామస్తులు స్వచ్ఛందంగా చందాలు వేసుకొని మట్టిరోడ్డు నిర్మించారు. ఏటా వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారుతుండగా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులే ఇంటింటికి రూ.5 వేలు జమ చేసుకుని మొరం వేయించి రోడ్డు నిర్మించారు.

గ్రామంలో 30 కుటుంబాలు..

ఎల్లాపూర్ గ్రామానికి కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో కాగజ్‌నగర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే వాంకిడి మండలం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వాంకిడి మండలం ఖమాన జీపీ పరిధి పూనగూడ నుంచి ఎల్లాపూర్ గ్రామానికి 3 కిలోమీటర్ల దూరం ఉండగా ఆ గ్రామానికి ఇప్పటికీ మట్టి రోడ్డే దిక్కుగా ఉంది. ప్రతీ ఏడాది వర్షాకాలంలో గ్రామస్తులకు దారికష్టాలు తప్పడం లేదు. ఆ దారి గుండా కనీసం ఎడ్లబండి కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. సమస్యను పలుమార్లు ఎమ్మెల్యే, సర్పంచుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించక పోవడంతో గ్రామస్తులే స్వయంగా మొరం మట్టితో రోడ్డు వేశారు. ప్రతీ ఇంటికి రూ. 5వేలు జమ చేయగా, ఇంట్లో డబ్బులు లేని వారు ఇతరుల వద్ద అప్పుగా తీసుకుని ఇచ్చారు. రహదారి వెంట పొలాలు ఉన్న ఇతరులు రూ.3వేల చొప్పున చందా ఇవ్వగా సుమారు రూ.2 లక్షలతో మొరంతో మట్టిరోడ్డు వేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డుపై అంబులెన్స్ కూడా నడవలేని పరిస్థితులు ఉన్నాయని, ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అధ్వాన పరిస్థితులు ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో తామే మొరం మట్టితో రోడ్డు నిర్మించామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేను మూడుసార్లు కలిశాం



ఎమ్మెల్యేను మూడుసార్లు కలిసి ప్రతీ ఏడాది వర్షాకాలంలో మేం పడుతున్న రహదారి కష్టాలను వివరించాం. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినా పనులు మాత్రం చేపట్టలేదు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఇంటింటికి రూ.3 వేల నుంచి రూ.5వేలు జమ చేసుకొని మొరం మట్టితో రోడ్డు వేశాం.

- సూర్పం రాంచందర్, గ్రామ పటేల్

కష్టపడి కూడబెట్టిన డబ్బులతో..



అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి, ఇతర పనులకు వెళ్లాలన్నా సరైన రహదారి లేక దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామస్తులు పడుతున్న కష్టాలు ఎవరికి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో కూలీ పనులు చేసి కూడబెట్టిన డబ్బులను మట్టిరోడ్డు నిర్మించేందుకు వెచ్చించాల్సి వచ్చింది.

- కుంరం బొజ్జిరావు, ఎల్లాపూర్

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన తారక్క
- వైద్యానికి రూ.2లక్షల వరకు అవసరం

బెజ్జూర్: వైద్యం కోసం ఆర్థిక స్థోమత లేక ఓ మహిళ మంచానికే పరిమితమైంది. బెజ్జూర్ గ్రామానికి చెందిన నానబోయిన పోషన్న యాదవ్ భార్య తారక్క కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మహారాష్ట్రలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు నిర్వహించగా ఆమెకు కాలేయం, కిడ్నీల ఇన్‌ఫెక్షన్ ఉందని వైద్యులు నిర్ధారించారు. దీనికోసం సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించలేక దేవుడిపై భారం వేశారు. తన భార్యను రక్షించేందుకు దాతలు ఎవరైనా ఉంటే ముందుకొచ్చి ఆర్థిక సాయం చేయాలని పోషన్న కోరుతున్నాడు. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు జావిద్, ఫోన్‌పే నంబర్ 6300005645, పురం వైకుంఠం యాదవ్ గూగుల్ పేనంబర్ 6303154617లకు చేయాలని కోరుతున్నాడు.



అనారోగ్యంతో బాధపడుతున్న తారక్క

చిత్తడవుతున్న పల్లె రహదారులు

చింతలమానెపల్లి: వర్షాకాలం ఆరంభంలోనే రహదారులు చిత్తడవుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాల రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. రవీంద్రనగర్1లోని ప్రధాన చౌరస్తాలో నీరు నిలిచిపోవడంతో చుట్టూ పక్కన ఇళ్లలోని వారు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ రహదారి గుండా బాబాపూర్, గంగాపూర్ గ్రామాలకు వెళ్లే వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారులు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆషాఢమాసం.. గోరింటాకు వేడుకలు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని మార్కెట్ మహిళా మండలి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని మంగళవారం గోరింటాకు సందడి నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని గోరింటాకు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, మార్కెట్ కమిటీ మండలి సభ్యులు పాల్గొన్నారు.



గోరింటాకు సంబరాల్లో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

ఎవెన్యూ ప్లాంటేషన్ పరిశీలన



పనులు చేయిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండల కేంద్రంలోని ఎవెన్యూ ప్లాంటేషన్‌ను ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. అనంతరం కెరమెరి గ్రామ పంచాయతీరోడ్, ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా గుంతలు తవ్వించి మొక్కలు నాటారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భీమయ్య ఉన్నారు.

ఉద్యోగుల బదిలీలు సహజం



వనితను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని మండల వైద్యాధికారి నవత అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ల్యాబ్ టెక్నీషియన్ వనితను వైద్య సిబ్బంది మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనిత మారుమూల కౌటాల పీహెచ్‌సీలో గత పదేళ్లుగా మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కౌటాల నుంచి నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు బదిలీపై వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మహాలక్ష్మి, పావని, స్టాఫ్ నర్సులు సునీత, వర్ష, సృజన, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలతో దేవతల అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శ్రీ వాసవీమాత ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయంలోని వాసవీదేవి, శాఖంబరీ దేవి విగ్రహాలను భక్తులు 21రకాల కూరగాయలతో అలంకరించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

అనాథ పిల్లలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామానికి చెందిన అనాథ పిల్లలకు మంగళవారం కౌటాల మాలి సంక్షేమ సంఘం నాయకులు రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావ్ మాట్లాడుతూ ఏడాది వ్యవధిలో ముగ్గురు పిల్లలు తల్లిదండ్రులను కోల్పోవడం చాలా బాధకరమన్నారు. పిల్లలకు మాలి సంఘం అండగా ఉంటుందని, దాతలు పిల్లలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదే వసంత్‌రావ్, నాయకులు ఆదే నాందేవ్, మోర్లె పాండురంగ్, సంజయ్, నారాయణ, వసంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎంఎంసీ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన: గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎంఎంసీ చెక్కును మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ మృతి చెందిన ఉద్యోగి భార్యకు అందజేశారు. జీఎం మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాండ్ల మల్లయ్య భార్య లక్ష్మికి ఎంఎంసీ కింద రూ. 29.35లక్షల చెక్కు అందించామని పేర్కొన్నారు. రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎంలు సతీష్‌కుమార్, రామారావు, ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.